www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
మంగళవారం | 02 | డిసెంబర్ | 2025
పేజీలు : 7

## బుల్లి పంచాయతీలు


-దొంగతోగులో 88 మంది ఓటర్లు

-అడవి రామవరంలో 85 మంది ఓటర్లు




2 లో

# తెలంగాణకు మణిహారం ఎర్త్ యూనివర్సిటీ


- నేడు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభం
- ప్రపంచంలోనే ఇది రెండో విశ్వవిద్యాలయం
- జిల్లాకు అరుదైన గౌరవం
- యుజి నుండి పిహెచ్‌డి వరకు కోర్సులు
- కూనంనేని కృషి, తుమ్మల చొరవ అమోఘం

ఎర్త్ యూనివర్సిటీ ... ఇది తెలంగాణకే మణిహారం.... ప్రపంచంలో ఇలాంటి యూనివర్సిటీలు రెండంటే రెండే ఉన్నాయి. ఆ రెండో యూనివర్సిటి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఏర్పాటు అయింది. పలు రకాల ఖనిజ సంపదకు కేంద్ర బిందువుగా ఉన్న భద్రాద్రి జిల్లాలో ఏర్పాటు కావడం విశేషం. రానున్న రోజుల్లో ప్రపంచం ఇటుగా తొంగిచూడనుంది. ఎర్త్ సైన్స్ పరిశోధనలకు భద్రాద్రి జిల్లాలో ఉన్న భౌగోళిక పరిస్థితులు అనుకూలం. ఇక్కడ యూనివర్సిటి నెలకొల్పేందుకు ఎంఎల్ఏ కూనంనేని సాంబ శివరావు చేసిన కృషికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవ గర్వకారణం కాగా. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.500 కోట్లతో 312 ఎకరాల విస్తీర్ణంలో విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పేందుకు ముందుకు రావడం అభినందనీయం.

-ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

2 లో

## మార్చి నాటికి అభివృద్ధి పనులు పూర్తి



-ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలి

-అభివృద్ధి పనులపై మీడియా సమావేశంలో మంత్రి తుమ్మల

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మార్చి 2026 నాటికి ఖమ్మం నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు కార్యాచరణ సిద్దం చేశామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. సోమవారం ఖమ్మం మున్సిపల్ కార్పోరేషన్ కార్యాలయంలో ఖమ్మం నగరంలో చేపట్టిన పలు అభివృద్ధి పనుల పురోగతిపై మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ గతేడాది మున్నేరు వరదల వల్ల వేలాది మంది ప్రజలు ఇబ్బందులు పడ్డారని ప్రతి ఏడాది వరదల కారణంగా ఖమ్మం నగరంలో పది డివిజన్ల ప్రజలు నిరాశ్రయులవుతున్నారని దీనికి శాశ్వత పరిష్కారంగా మున్నేరు నదికి ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మిస్తున్నామన్నారు. రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అడ్డంకిగా మారిన భూ సేకరణ సమస్య, ఆక్రమణల తొలగింపు ప్రక్రియ వేగవంతం చేసి నిర్మాణ పనులు నిర్దిష్ట మార్చి 2026 లోగా పూర్తి చేసేందుకు కార్యాచరణ సిద్దం చేశామన్నారు. ఎస్టిపి నిర్మాణం, కేబుల్ బ్రిడ్జి దగ్గర రోడ్డు వెడల్పు పనులు, రిటైనింగ్ వాల్ నిర్మాణానికి సంబంధించిన భూ సేకరణ యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని, 10 రోజుల్లో భూములు సంబంధిత ఏజెన్సీలకు అప్పగించాలని రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ

మిగతా 2లో..

## రాజకీయాలకతీతంగా కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి



-బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కోసం కృషి

-ఎర్త్ సైన్స్ విశ్వ విద్యాలయం దేశానికే తలమానికం

-నూతి బాధ్యతల స్వీకరణ సభలో ఉప ముఖ్యమంత్రి భట్టి

-పాల్గొన్న మంత్రులు తుమ్మల, పొంగులేటి, పలువురు కాంగ్రెస్ నేతలు

**ప్రజాపక్షం/ఖమ్మం :** గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా, రాజకీయాలకు అతీతంగా కాంగ్రెస్ అభ్యర్థులను స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భటి విక్రమార్క కోరారు. గ్రామాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక కృషి చేస్తుందని ఆయన తెలిపారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులుగా నియమాకమైన నూతి సత్య నారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే పెద్ద ఎత్తున అభివృద్ధి జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకు వచ్చేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని ఆయన తెలిపారు. దేశంలో ఎక్కడ లేనివిధంగా కొత్తగూడెంలో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని ప్రారంభించబోతున్నామని ఇది దేశానికే తలమానికం కానుందన్నారు. రాష్ట్రంలో సుపరిపాలన సాగుతుందని కేవలం సంక్షేమ పథకాల కోసమే రూ.1.10 లక్షల కోట్లు ఖర్చు

మిగతా 2లో..

# తెలంగాణకు మణిహారం ఎర్త్ యూనివర్సిటీ

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఏర్పాటుతో తెలంగాణ రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు అరుదైన గౌరవం దక్కింది. ఇప్పటికే పరిశ్రమల ఖిల్లాగా పేరుగాంచిన భద్రాద్రి జిల్లాలో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఏర్పాటు మరింత గౌరవాన్ని తెచ్చిపెట్టింది. రవాణాకు సైతం అనువైన ప్రాంతం కావడంతో విలువైన ఖనిజ సంపదలు ఈ నెలలో నిక్షిప్తమై ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వ క్యాబినేట్ ఆమోదంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీనిని భారత మాజీప్రధాని, ఆర్థిక సంస్కరణల సృష్టి కర్త డా. మన్మోహన్ సింగ్ పేరిట నెలకొల్పుతుండగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నేడు ప్రారంభానికి నోచుకుంది.

### ప్రపంచంలోనే రెండోది...

ఇప్పటి వరకు పలు రకాల యూనివర్సిటీలు ఉండగా డా.మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ మాత్రం ప్రపంచ వ్యాప్తంగా రెండోది. భారత దేశంలోనే మొదటిది. అందునా భద్రాద్రి జిల్లాలో ఏర్పాటు కావడం తెలంగాణకే గర్వకారణంగా మారింది. దీంతో జిల్లాకు అరుదైన గౌరవం దక్కింది. జియో కెమిస్ట్రి, ఫిజిక్స్, ప్లానెటరీ జియాలజీ, మినరల్ సైన్స పర్యావరణ , భూగర్భ శాస్త్రం వంటి అత్యాధునిక కోర్సులు ఈ యూనివర్సిటీ ద్వారా ప్రపంచానికి అందించనున్నారు.

### యూజి నుండి పిహెచ్‌డి వరకు...

గ్రాడ్యుయేషన్ మొదలుకుని పోస్టు గ్రాడ్యుయేషన్, యూజిసి ప్రమాణాలతో పిహెచ్‌డి కోర్సులు అందించనున్నారు. దేశ విదేశాల నుండి ఈ ఎర్త్ యూనివర్సిటీలో చదువుకునేందుకు తరలిరానున్నారు. దీంతో ప్రపంచమే భద్రాద్రి వైపు తొంగిచూడనుంది.ఖనిజ సంపదకు జిల్లా కేంద్రబిందువుగా ఉండటంతో యూనివర్సిటీ ఏర్పాటుతో సార్థకత చేకూరనుంది. ఇప్పటికే మినీ స్టీల్ ప్లాంట్, ఫెర్రో అలాయిస్ యూనిట్లు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, ఐటిసి పేపర్ బోర్డు, హెవీ వాటర్ ప్లాంట్, నేషనల్ హై వే, రైల్వే లైన్, గోదావరి నది సమీపంలో ఉన్నాయి. మరో ప్రక్క విమానాశ్రయం ప్రతిపాదనలో ఉంది.

### యువతకు మేలు...

జిల్లాలో డా.మన్మోహన్ సింగ్ ఎర్త్ యూనివర్సిటీ ఏర్పాటుతో యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి. మరో ప్రక్క యూనివర్సిటీ కేంద్రంగా పరిశోధనా అవకాశాలు విస్తరించనున్నాయి. ప్రపంచ దేశాల నుండి శాస్త్రవేత్తలు, అధ్యాపకులు ఇక్కడికి రానుండటంతో విద్య పరంగా ప్రపంచంలోనే మేటిగా ఈ జిల్లా మారనుంది.

### కూనంనేని కృషి అమోఘం...

ఎర్త్ యూనవర్సిటీ ఏర్పాటులో కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు కృషి అమోఘం. యూనివర్సిటీకి అనువైన ప్రాంతం కావడంతో తుమ్మల నాగేశ్వర రావు యూనివర్సిటీ ఏర్పాటుకు చొరవ చూపారు. దీంతో తుమ్మల, కూనంనేని కలిసి దీనిపై కసరత్తు చేసి వివరాలు తెప్పించుకుని యూనివర్సిటీ ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై కలెక్టర్ జితేష్ విపాటిల్‌ను పరిశీలిన చేయాలని సూచించారు. దీంతో ఆయన ప్రపంచ వ్యాప్తంగా ఎర్త్ యూనివర్సిటీ ఏర్పాటుకు కావాల్సిన వాతావరణం, పర్యావరణం, భౌగోళ స్థితి గతులను అధ్యాయనం చేయడంతోయూనివర్సిటీ ఏర్పాటుకు ఇదే అనువైన ప్రదేశంగా తేల్చారు. కాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి విషయాన్ని చేరవయగా క్యాబినేట్ ఆమోదనం అనంతరం డా. మన్మోహన్ సింగ్ ఎర్త్ యూనివర్సిటీగా నామకరణం చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఆ యూనివర్సీటీ నేడు రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం కానుంది.

# రాజకీయాలకతీతంగా కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి





(మొదటిపేజీ తరువాయి)

చేస్తున్నామన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు పార్లమెంట్ వేదికగా పోరాడతామన్నారు. అసెంబ్లీలో బిల్లు పెట్టి ఏకగ్రీవంగా ఆమోదించిన రాష్ట్రపతి వద్ద ఆ బిల్లు ఆగిపోయిందన్నారు. ధర్నా చేసిన ఫలితం లేకుండాపోయిందని భట్టి తెలిపారు. బలహీన వర్గాలకు పార్టీ పరంగా అన్ని విధాలా మేలు చేస్తామని ఆయన తెలిపారు. తెలంగాణ తల ఎత్తుకుని నిలబడేలా విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించడం జరిగిందని భట్టి విక్రమార్క తెలిపారు. డిసెంబర్ 10 నుంచి 13 వరకు విజన్ డాక్యుమెంట్‌ను పరిశీలించాలని ఆయన కోరారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన నూతి సత్యనారాయణ కుటుంబం స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబమని నూతి అనంతరాములు తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాంకు వ్యతిరేకంగా పోరాడారన్నారు. అన్ని వసతులతో జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ కార్యాలయాన్ని నిర్మిస్తామని త్వరలోనే నిర్మాణ కమిటీని ప్రకటిస్తామని ఆయన తెలిపారు. స్థలానికి సంబంధించి ప్రభుత్వానికి డబ్బులు కూడా చెల్లించామని ఆయన తెలిపారు. సభలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, ఎంఎల్ఏలు రాంచందర్ నాయక్, రాగమయి, నాయకులు నాయుడు సత్యనారాయణ, పోట్ల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మి నారాయణ, కొండబాల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. వైరా నుంచి భారీగా ర్యాలీగా బయలుదేరి కాంగ్రెస్ కార్యాలయానికి చేరుకున్నారు. అంబేద్కర్, పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# పల్లెల్లో వేడెక్కిన స్థానిక సమరం..!

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామపంచాయతీలలో మూడో తేదీ నుంచి నామినేషన్ ప్రక్రియ ప్రారంభం కానున్న దృష్ట్యా గ్రామాల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు సన్నాహక సమావేశాలు నిర్వహించారు. మండలంలో పేరువంచ, చిన్న కోరుకొండి, ముగ్గ వెంకటాపురం, మర్లపాడు పెద్ద కోరుకొండి, చంద్రు పట్ల, తెలగారం, రఘునాథ గూడెం, లక్ష్మీ పురం, ఎర్రబోయినపల్లి, పోచారం, ఓబుల రావు బంజర్ ఆయా గ్రామాలలో అభ్యర్థులు ఎంపికలు పోటాపోటీగా సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు. అభ్యర్థులు ఎంపికలో కార్యకర్తలు నాయకుల అభిప్రాయాలను సేకరిస్తున్నారు. అదే విధంగా చెన్నూరు గ్రామంలో సోమవారం ఇరువురు పార్టీలు సర్పంచ్, వార్డు అభ్యర్థులు ఎంపికలు మధ్యాహ్నం వరకు సమావేశాలు వేరువేరుగా నిర్వహించారు. నామినేషన్ ప్రక్రియ మూడో తేదీ నుంచి 5వ తేదీ వరకు కొనసాగుతుండగా వార్డు సర్పంచ్ అభ్యర్థులు ఎంపికలు ఇప్పటికే పూర్తిచేసుకుని రహస్యంగా ఉంచుకోగా మరికొన్ని గ్రామాలలో అభిప్రాయ సేకరణ జరుగుతోంది. ఆర్థికంగా, ప్రజల్లో బలంగా ఉన్న అభ్యర్థుల ఎంపికలో ఇరువురు పార్టీలు కీలకంగా రహస్యంగా ఎంపికలు కొనసాగిస్తున్నారు. ఈ సమయంలో కార్యకర్తలు నాయకుల అభిప్రాయాలను సేకరించుకొని సిద్ధం చేసుకున్నారు. అదే విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ కలిగిన గ్రామాల్లో కూడా సన్నాహక సమావేశాలు నిర్వహించి కాంగ్రెస్ బిఆర్ఎస్ పార్టీలు సిద్ధం చేసుకుని ఉన్నారు. ఇరువురు సామాజిక వర్గాలలో ప్రజల్లో ఉన్న బలం, ఆర్థికంగా తట్టుకునే వ్యక్తులను రహస్యంగా ఉంచారు. కొన్ని గ్రామాల్లో ఎంపికలు పూర్తిచేసుకుని అంతర్గతంగా ఉంచారు. మరి కొన్ని గ్రామాలలో బేధాభిప్రాయాలలో ఎంపిక చేయడంలో వర్గ విభేదాలు ఉండటంతో పంచాయతీ అధిష్టానానికి చేర్చారు. ముందంజలో కాంగ్రెస్ పార్టీ ఎంపిక ఉండగా రెండో స్థానంలో బి ఆర్ ఎస్ ఉంది. ఒక్కో గ్రామంలో అధికార పార్టీ అభ్యర్థులను బట్టి ప్రతిపక్ష పార్టీ అభ్యర్థిని ఎంపిక చేసే పనిలో ఉన్నట్లు ఉంది. అందరి అభ్యర్థుల పేర్లను మూడో తేదీ నుంచి 5వ తేదీ లోపల నామినేషన్ ప్రక్రియలో బహిర్గతం కానుంది.



# బుల్లి పంచాయతీలు

**ప్రజాపక్షం/ఖమ్మం :** గ్రామ పంచాయతీ ఎన్నికల వేళ అభ్యర్థులు, ఓటర్లు ఖర్చు తదితర విషయాలపై చర్చలు జరుగుతుండటం సహజమే. ఓటర్ల సంఖ్య స్థానిక ఎన్నికల్లో ప్రధానమైంది. అతి తక్కువ ఓటర్లతో రెండు గ్రామ పంచాయతీలు రాష్ట్రంలో బుల్లి పంచాయతీలుగా రికార్డుకెక్కాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండలంలో మొత్తం 12 గ్రామ పంచాయతీలు ఉండగా అడవి రామవరం గ్రామ పంచాయతీలో 85 మంది మహిళలు ఉన్నారు. గ్రామ పంచాయతీని నాలుగు వార్డులుగా విభజించారు. ఒక వార్డుకు 22 ఓట్లు ఉండగా మిగిలిన మూడు వార్డుల్లో 21 ఓట్ల చొప్పున ఉన్నాయి. ఇదే మండలం దొంగతోగు గ్రామ పంచాయతీలో 88 ఓట్లు ఉన్నాయి. 48 మంది పురుషులు కాగా 40 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఈ గ్రామ పంచాయతీని కూడా నాలుగు వార్డులుగా విభజించి ఒక్కో వార్డుకు 22 ఓట్లు చొప్పున కేటాయించారు. గతంలో దొంగతోగు పంచాయతీలో కేవలం 32 మంది ఓటర్లు మాత్రమే ఉండేవారు. అయినా భౌతిక పరిస్థితుల దృష్ట్యా గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారు. దొంగతోగు, అడవి రామవరం రెండు పూర్తిగా అటవీ గ్రామలు. రోడ్డు మార్గం చేరాలంటే ఏటైనా ఏడు నుంచి 10 కిలో మీటర్ల దూరం ప్రయాణించాల్సిందే. దొంగతోగు గుండాలకు 11 కిలో మీటర్ల దూరంలో దట్టమైన అడవిలో కిన్నెరసాని నది పక్కన ఉంటుంది. అడవి రామవరం ఆళ్లపల్లి మండలంలోని మర్కోడ్‌కు ఏడు కిలో మీటర్ల దూరంలో ఉంటుంది. పూర్తి అడవిలో ఉండటం ఏ పంచాయతీలోనైనా కలిపేందుకు వీలు లేకుండా దూరంగా ఉండడంతో చిన్న గ్రామాలే అయినప్పటికీ పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. మూడవ విడతలో ఈ గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. ఇక్కడి ఓటర్లంతా గిరిజనులు సమీప బంధువులు కావడంతో ఏకగ్రీవం చేసుకుంటారో లేదా ఎన్నికలకు వెళ్తారో వేచి చూడాలి.

# మార్చి నాటికి అభివృద్ధి పనులు పూర్తి

(మొదటిపేజీ తరువాయి)

చేశామన్నారు. రాష్ట్రంలో మూడు కేబుల్ బ్రిడ్జిలు ఉన్నాయని హైదరాబాద్‌లోని దుర్గం చెరువు, కరీంనగర్‌లో మానేరు నదిపై కేబుల్ బ్రిడ్జిలను తన హయాంలోనే మంజూరు చేశామని ఖమ్మంలో కేబుల్ బ్రిడ్జి నిర్మాణం జరుగుతుందన్నారు. మిగిలిన రెండు బ్రిడ్జిల కంటే మున్నేరు కేబుల్ బ్రిడ్జి పెద్దదన్నారు. కేబుల్ బ్రిడ్జి వద్ద పర్యాటకంగా కూడా అభివృద్ధి జరిగేలా టూరిజం ప్యాకేజీ ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రపంచంలోనే బెస్ట్‌గా ఉండేవిధంగా కేబుల్ బ్రిడ్జి వద్ద లైటింగ్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. బాలపేట, బల్లేపల్లి, ఖానాపురం చెరువుల నుంచి వర్షాకాలం వరద నీరు అధికంగా వస్తుందని దీని నియంత్రణకు రూ. 200 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టామన్నారు. 10 రోజుల్లో ఎస్టిపి నిర్మాణ పాయింట్ ఖరారు చేసి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. మార్చి నాటికి పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని ఖమ్మంకు మణిహారంగా కేబుల్ బ్రిడ్జి నిర్మాణం జరుగుతుందన్నారు. డిసెంబర్ 2న కొత్తగూడెంలో జరగనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. దేశానికే తలమానికంగా ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఉంటుందన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అధికంగా ఖనిజాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విశ్వ విద్యాలయం లేదని ఎర్త్ సైన్స్ విశ్వ విద్యాలయం ఏర్పాటు చేయాలని పంపిన ప్రతిపాదనను ఆమోదించిన ముఖ్యమంత్రికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఎర్త్ సైన్స్ విశ్వ విద్యాలయానికి మాజీ ప్రధాని డా॥ మన్మోహన్ సింగ్ పేరు పెట్టడం జరిగిందని దీనిని ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేయడం జరుగుతుందని దానిని విజయవంతం చేయాలని మంత్రి తెలిపారు. ఈసమావేశంలో మేయర్ పునుకొల్లు నీరజ, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# జోరుగా సిపిఐ అభ్యర్థుల నామినేషన్లు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలో రెండవరోజు సోమవారం సిపిఐ అభ్యర్థులు నామినేషన్లను వేశారు. గూడూరుపాడులో సర్పంచ్ అభ్యర్థిగా పుచ్చకాయల శ్రీదేవిక మలాకర్, పల్లెగూడెంలో చూండురి సృజన, చింతిగింద కృష్ణకుమారి, కస్నాతండలో అజ్మీరా రామ్మూర్తినాయక్, కామంచికల్‌లో గండ్రా భరత్, దారేడులో బత్తిని వెంకటేశ్వర్లు, ఆరెకోడుతండలో బానోత్ సుధారణి నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే వార్డు మెంబర్లకు సైతం నామినేషన్లను జోరుగా వేశారు. ఈ కార్యక్రమాలలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి పెద్ద వెంకట్‌రెడ్డి, పుచ్చకాయల కమలాకర్, సిద్ధినేని కర్ణకుమార్, జిల్లా సమితి సభ్యులు యడ్లపల్లి శంకరయ్య, పగీళ్ల వీరభద్రం, చెరుకుపల్లి భాస్కర్, వెంపటి సురేందర్, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి




**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా కిండిల్ రూరల్ వెల్ఫేర్ సొసైటీ వారు స్థానిక ఎర్రుపాలెం ఎస్‌వి అకాడమీ నందు ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. అవగాహన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షురాలు వి.అనూష మాట్లాడుతూ యువత హెచ్‌ఐవి ఎయిడ్స్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సంవత్సరం ఎయిడ్స్ దినోత్సవానికి ఇతివృత్తంగా అంతరాయాన్ని అధిగమించడం ఎయిడ్స్ ప్రతి స్పందనను మార్చడం అనే ఇతివృత్తతంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు కనకవల్లి నాగరాజు, పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్‌కుమార్, కరస్పాండెంట్ మిరియాల శ్యామ్‌ప్రసాద్, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# నిర్దిష్ట గడువు లోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

**-భూ సేకరణ అత్యంత ప్రాధాన్యతగా పరిగణించాలి**
**-మార్చి నాటికి రిటైనింగ్ వాల్ పనులు పూర్తి**
**-రిటైనింగ్ వాల్, కేబుల్ బ్రిడ్జి, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులపై మంత్రి తుమ్మల సమీక్ష**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అభివృద్ధి పనులు నిర్దిష్ట గడువు లోగా పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ సమావేశ మందిరంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మున్నేరు నదిపై రిటైనింగ్ వాల్, కేబుల్ బ్రిడ్జి నిర్మాణం, ఖమ్మం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులపై మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ మున్నేరు నదికి ఇరువైపులా నిర్మిస్తున్న రిటైనిం గ్ వాల్ నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ యుద్ధ ప్రాతిప దికన పూర్తి చేయాలని ప్రస్తుతం వర్కింగ్ సీజన్ నడుస్తుందని పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మున్నేరు నదిపై రిటైనింగ్ వాల్ నిర్మాణానికి బైపాస్ రోడ్డు నుంచి కేబుల్ బ్రిడ్జి వరకు మొదటి ప్రాధాన్యతగా కేబుల్ నుంచి ప్రకాష్ నగర్ బ్రిడ్జి వరకు రెండవ ప్రాధాన్యతగా పెండింగ్ భూసేకరణ త్వరగా క్లియర్ చేయాలని తెలిపారు. రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ నిమిత్తం భూముల బదలాయింపు కోసం అడ్వాన్స్ పోజిషన్ వెంటనే అందించాలని సంబంధిత రాష్ట్ర స్థాయి అధికారులను మంత్రి చరవాణిలో ఆదేశించారు. మార్చి 2026 నాటికి రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని తెలిపారు. నూతన టెక్నాలజీతో కేబుల్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరగాలని, హైదరాబాద్ దుర్గం చెరువు, కరీంనగర్ మానేరు నదిపై గతంలో కేబుల్ బ్రిడ్జిలు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో మూడవ కేబుల్ బ్రిడ్జి ఖమ్మం నగరంలో నిర్మాణమవుతుందని తెలిపారు. కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి అనుగుణంగా అవసరమైన పవర్ లైన్స్, విద్యుత్ స్తంభాల తరలింపు పక్షం రోజుల్లో పూర్తి చేయాలని తెలిపారు. త్రాగునీటి పైపులైన్, పవర్‌లైన్ తరలింపు పనులు సమాంతరంగా జరగాలన్నారు. కేబుల్ బ్రిడ్జిపై లైటింగ్ అద్భుతంగా ఉండేలా చూడాలన్నారు. ఖమ్మం నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఎస్‌టిపి నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ పనులు వెంటనే పూర్తి చేయాలని ప్రజలను ఒప్పించి భూ సేకరణ పూర్తి చేసి సంబంధిత ఏజెన్సీలకు భూమి అప్పగించాలన్నారు. ఈ సమావేశంలో పబ్లిక్ హెల్త్ ఎస్ఈ రంజిత్, ఇరిగేషన్ ఎస్ఈ ఎం. వెంకటేశ్వర్లు, ఆర్అండ్‌బి ఎస్ఈ యాకోబ్, విద్యుత్ ఎస్ఈ, తహసీల్దార్లు రాంప్రసాద్, సైదులు, ఏజెన్సీ ప్రతినిధులు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# యువతలో శారీరక ధృడత్వం పెరగాలి

**-రాజకీయ సైద్ధాంతిక శిక్షణ అవసరం**
**-జనసేవా దళ్ శిక్షణను ప్రారంభించిన దండి సురేష్**





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** యువతలో శారీరక ధృడత్వంతో పాటు మానసిక పరివర్తన, సమాజం పట్ల అవగాహన అవసరమని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. సమకాలిన పరిస్థితులకు అనుగుణంగా రాజకీయ సైద్ధాంతిక శిక్షణ పొందాలని ఆయన సూచించారు. ఖమ్మం నగర స్థాయి జనసేవా దళ్ శిక్షణా శిబిరం సోమవారం ఖమ్మం నగరంలోని 14వ డివిజన్ కొత్తగూడెంలో ప్రారంభమైంది. శిక్షణను సిపిఐ జిల్లా కార్యదర్శి సురేష్ ప్రారంభించారు.ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ జనాభాలో సగానికి పైగా కలిగిన యువత పాలక వర్గాల తీరుతో నైరాశ్యానికి గురవుతుందన్నారు. ఉపాధి, ఉద్యోగాల కల్పనలో పాలకులు విఫలం కావడంతో యువశక్తి నిర్వీర్యమవుతుందన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులలో యువత చైతన్యవంతమైన ఆలోచనలతో రాజకీయాల్లోకి రావాలని వామపక్ష ప్రజాతంత్ర లౌకిక శక్తులకు మద్దతుగా నిలవాల్సి ఉందన్నారు. నిరుద్యోగం పెరిగిన నేపథ్యంలో పాలకులు కర్మ సిద్దాంతాన్ని బోధిస్తూ పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన తెలిపారు. సుదీర్ఘ కాలం పోరాటాలతో అనేక హక్కులను, సంక్షేమ పథకాలను సాధించిన భారత కమ్యూనిస్టు పార్టీ శత వార్షికోత్సవ ముగింపు ఉత్సవాలను జనవరి 18న ఖమ్మంలో జరుపుకుంటుందని సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఐదువేల మంది యువకులకు జన సేవాదళ్ శిక్షణ ఇస్తుమన్నారు. శారీరకంగా ధృడత్వం కలిగి ఉన్నప్పుడే మానసిక పరిపక్వత లభిస్తుందని శారీరక ధృడత్వం కలిగి సమాజ ఉన్నతికి కృషి చేయాలని ఆయన యువతను కోరారు. భారత కమ్యూనిస్టు పార్టీ చరిత్రను నేటి తరానికి తెలియజేస్తూ సమస్యలపై జరిగే పోరాటాలకు సంబంధించి కార్యోన్ముఖులను చేయడమే లక్ష్యంగా శతాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తున్నామని సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్‌కె జానిమియా, మహ్మద్ సలాం, కార్పొరేటర్ బిజి క్లెమెంట్, జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, నగర నాయకులు నూనె శశిధర్, వరదా నర్సింహారావు, సైదా, మాలకొండయ్య, రావుల హన్మంతరావు, మాడుగుల నాగేశ్వరరావు, జ్వాలా నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

# బుజ్జగింపులు.. ప్రలోభాలు..!





**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ ప్రక్రియ పూర్తి కావడంతో ఇప్పుడు నాయకులు బుజ్జగింపులు, ప్రలోభాలను ప్రారంభించారు. రఘునాథపాలెం మండలంలో మొత్తం 37 గ్రామ పంచాయతీలు ఉండగా సర్పంచ్ స్థానాలకు 254, 308 వార్డు స్థానాలకు 795 మంది నామినేషన్లు దాఖలు చేశారు. మంగ్యాతండా గ్రామ పంచాయతీలో సర్పంచ్, వార్డు స్థానాలకు ఒక్కొక్క నామినేషన్ దాఖలు కావడంతో అక్కడ ఏకగ్రీవమైనప్పటికీ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. మిగిలిన అన్ని గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలకు పదుల సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. ఈనెల మూడున (బుధవారం) సాయంత్రం మూడు గంటల వరకు ఉప సంహరణలకు గడువు ఉండడంతో నామినేషన్‌లు వేసిన వారిని బుజ్జగించడంతో పాటు ప్రలోభాలకు గురి చేస్తున్నారు. నామినేషన్‌లు విత్‌డ్రా చేసుకుంటే నామినెటెడ్ పదవుల్లో అవకాశం, పార్టీలో ప్రాధాన్యత కల్పిస్తామంటూ బుజ్జగిస్తున్నారు. మరి కొంత మందికి తులమో ఫలమో ఇస్తామంటూ ప్రలోభాలకు గురి చేస్తూ నామినేషన్లు విత్‌డ్రా చేసుకునేలా చర్చలు జరుపుతున్నారు. కొన్ని గ్రామ పంచాయతీలలో అధికార పార్టీ నాయకులు ఏకగ్రీవం చేసేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారు. గ్రామాల్లో గుడి నిర్మాణానికి అవసరమైన నిధులు సమకూరుస్తామని హామీ ఇస్తూ ఓ గ్రామ పంచాయతీని ఏకగ్రీవం చేసేందుకు సిద్ధమైనట్లు సమాచారం. అదేవిధంగా ప్రస్తుతం పలు గ్రామాల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్ లలో వలసలు మొదలయ్యాయి. కాంగ్రెస్ నుంచి బిఆర్ఎస్‌లోకి బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి కార్యకర్తలను చేర్చుకుంటున్నారు. మొత్తంగా గ్రామాల్లో ఎన్నికల సందడి మొదలైంది. పగలు రాత్రి అనే తేడా లేకుండా పోటీ చేసే అభ్యర్థులు తమకు అనుకూలమైన వారిని కలుస్తూ తమను గెలిపించాలని కోరుతున్నారు.

## బాబాస్ హైదరాబాదీ బిర్యానీ రెస్టారెంట్ ప్రారంభం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పట్టణంలోని జ్యోతి నిలయం ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన బాబాస్ హైదరాబాదీ బిర్యానీ, ఇరానీ చాయ్ రెస్టారెంట్ , పాన్ షాప్ లను తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డా. కోటూరి మానవతారాయ్ లు సోమవారం ప్రారంభించారు. సత్తుపల్లి పట్టణ ప్రజలకి హైద్రాబాద్ తరహా బిర్యానీ, ఇరానీ చాయ్ రుచులు అందించేందుకు సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ మైనారిటీ నాయకులు ఫజల్ రహమాన్ ఈ రెస్టారెంట్ అన్ని హంగులతో ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మాజీ ఎంపిటిసి ఐ కృష్ణ, బచ్చు వెంకటేశ్వరరావు, ఎండి సమద్, భాస్కరరావు,ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## పలువురిని పరామర్శించిన సండ్ర



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి పట్టణానికి చెందిన చల్లగుళ్ళ నారాయణ ఇటీవల మృతి చెందగా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య చల్లగుళ్ళ నివాసానికి చేరుకుని నారాయణ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళ్ళులర్పించారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొర్రపాటి సాల్మన్ రాజ్ తండ్రి జాన్ ఇటీవల మరణించగా వారి నివాసానికి చేరుకుని జాన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, దైర్యం చెప్పారు. సండ్ర వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, పట్టణ అధ్యక్షుడు షేక్ రఫీ, ప్రధాన కార్యదర్శి మల్లూరు అంకంరాజు, చాంద్ పాషా, అద్దంకి అనిల్, వల్లభనేని పవన్, పర్వతనేని వేణు, కృష్ణ తదితరులున్నారు.

## హెల్ప్ డెస్క్ లను సందర్శించిన సబ్ కలెక్టర్



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు ఇబ్బందులు కలగకుండా పకడ్బంది చర్యల్లో భాగంగా సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ సత్తుపల్లి మండలంలో సోమవారం విస్తృతంగా పర్యటించారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ లను సందర్శించారు. పోలింగ్ స్టేషన్ వారిగా మెటీరియల్ వేరు చేస్తున్నామని ఎంపీడీఓ సబ్ కలెక్టర్ కి తెలియజేశారు. అనంతరం కిష్టారం గ్రామ పంచాయతీ క్లస్టర్ ను విజిట్ చేసి పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేశ్వరరావు, తహాశీల్దార్ పున్నం సత్యనారాయణ,మాస్టర్ ట్రైనీ మధు, ఎంపీవో, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌లో చేరిన దుబ్బాక చందు దంపతులు





**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని సదాశివునిపేట గ్రామానికి చెందిన దుబ్బాక చందు యశోద దంపతులతో పాటు మరో 15 కుటుంబాలు సోమవారం బీఆర్ఎస్ పార్టీలో చేరాయి. సత్తుపల్లి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సండ్ర వెంకట వీరయ్య దుబ్బాక చందు యశోద ను సదాశివునిపేట బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కూసంపూడి మహేష్, తుంబూరు దామోదర్ రెడ్డి, కాలినేని వెంకటేశ్వరరావు, షేక్ రఫీ, మల్లూరు అంకంరాజు, అద్దంకి అనిల్, చాంద్ పాషా, వల్లభనేని పవన్, పర్వతనేని వేణు, వినుకొండ వెంకటరామయ్య, పర్స కృష్ణ, సుబ్బారావు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ నివారణ దినోత్సవ ర్యాలీ




**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని జాతీయ రహదారిపై ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని విద్యార్థులు ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఆధ్వర్యంలో ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించి అవగాహన కార్యక్రమాన్ని కల్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో ఎయిడ్స్ నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్రతిజ్ఞను చేపట్టారు. ఎయిడ్స్ అంటుకునే వ్యాధి కాదని అంటించుకునే వ్యాధి అని ఎయిడ్స్ పై నివారణే ఒక్క మార్గమని ఉండాలని అప్రమత్తంగా ఉండాలని నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ సేవా ప్రాజెక్టు అధికారి వీరభద్రం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ షేక్ షకీల భాను, అధ్యాపకులు శ్రీనివాసరావు, కిరణ్, వరలక్ష్మి, ప్రసన్న, శ్రీరాములు, పుల్లారావు, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

## నూతి సత్యనారాయణకు సన్మానం



ప్రజాపక్షం/వైరా: ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా ఎన్నిక అయిన నూతి సత్యనారాయణను కలిసి శుభాకాంక్షలు తెలియజేసి సన్మానించిన వైరా మున్సిపాలిటీ 7వ వార్డు నాయకులు ఫణితి సైదులు, పోటు మధు, దార్ల శేఖర్, సరిపూడి కోటేశ్వరరావు, దారా వెంకన్న, ఫణితి వెంకటేశ్వర్లు, ఫణితి వంశబు, ఫణితి అబ్బాస్, అనుమోలు సైదులు, దారా సుధాకర్, కాంద్ర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## మద్దుకూరు సర్పంచిగా అత్తా కోడలు పోటీ





ప్రజాపక్షం/చంద్రుగొండ: మండల పరిధిలోని మద్దుకూరు గ్రామ పంచాయితీ సర్పంచ్ పదవికి ఇరు పార్టీల నుండి అత్తా కోడలు సోమవారం నామినేషన్లు వేశారు. బిజెపి కూటమి బలపర్చిన బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా కోడలు కోడెం కృష్ణవేణి నామినేషన్ వేశారు. కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థిగా అత్తా మాజీ ఎంపీటీసీ నడివి పార్వతి నామినేషన్ వేశారు. పార్వతి సొంత అక్క కోడలు కృష్ణవేణి దీంతో పంచాయితీలో ఇరువురి మధ్య పోటీ రాజకీయంగా రసవత్తరంగా మారింది.

## రెండో రోజు కొనసాగిన నామినేషన్ల పర్వం



ప్రజాపక్షం/చంద్రుగొండ: రెండో రోజు సోమవారం పలు రాజకీయ పార్టీలు తమ అభ్యర్థుల నామినేషన్లు భారీగా వేశారు. ప్రశాంతంగా చంద్రుగొండ రాయికంపాడు గానుగుపాడు దామచర్ల సెంటర్‌లో నామినేషన్లు 14 గ్రామ పంచాయితీల నుండి వేశారు. 14 గ్రామ పంచాయితీలకు గాను 28 మంది సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. చంద్రుగొండ మాజీ సర్పంచ్ ఇస్లావత్ రుక్మిణి కాంగ్రెస్ అభ్యర్థిగా చంద్రుగొండ సర్పంచ్‌కు నామినేషన్ వేశారు.మంగళవారం ఆఖరి రోజు కావటంతో భారీగా నామినేషన్లు దాఖలు చేసేందుకు పలు పార్టీల అభ్యర్థులు సిద్ధమవుతున్నారు.

## ఘనంగా అయ్యప్ప స్వాముల ఇరుముడి



ప్రజాపక్షం/కరకగూడెం: మాల ధరించిన స్వాముల ఇరుముడి కార్యక్రమం సోమవారం మండల కేంద్రమైన కరకగూడెంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం ఇప్ప చెట్టు గుంపు, గౌరమ్మ గుడి దగ్గర ఇరుముడి కార్యక్రమాన్ని నిర్వహించారు. 15 మంది మాల ధరించిన అయ్యప్ప స్వాములు 41 రోజుల పాటు దీక్ష అనంతరం శబరిమలై వెళ్లి అయ్యప్ప స్వామిని దర్శించుకునేందుకు ఇరుముడి కార్యక్రమాన్ని గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇరుముడి సందర్భంగా అయ్యప్ప స్వాముల కుటుంబ సభ్యులు, బంధువుల రాకతో గుడి ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. ఇరుముడి అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామటంకి మురళీధర్ గాంధర్ల సతీష్, గాంధర్ల సతీష్ గాంధర్ల ధనంజయ్, గోగు సాయి జాడి దినేష్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ కేంద్రాలను సందర్శించిన అబ్జర్వర్



ప్రజాపక్షం/పాల్వంచ : నామినేషన్ వేయటానికి వచ్చిన అభ్యర్థులకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా ప్రశాంత వాతారవణంలో నామినేషన్ ప్రక్రియ జరిగేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామ పంచాయితీ కార్యదర్శులను ఎలక్షన్ అబ్జర్వర్ సర్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల పరిధి కోడిపుంజులవాగు, బంజర, సత్యనారాయణపురం, ఉల్వనూర్ తదితర గ్రామ పంచాయితీలలో గల నామినేషన్‌ల కేంద్రాలను సోమవారం పరిశీలించారు. ఈ సంధర్భంగా సర్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ హెల్ప్‌డెస్క్‌లో కార్యదర్శులు అభ్యర్థుల నామినేషన్‌ల పత్రాలను పూర్తిగా పొరపాట్లు లేకుండా పరిశీలించి రిటర్నింగ్ అధికారికి పంపించాలని సూచించారు. సాయంత్రం ఐదు గంటలకు ఒక్క నిమిషం ముందు వచ్చినప్పటికి నామినేషన్‌లు తీసుకోవాలని అన్నారు. ఈ ప్రక్రియలో కార్యదర్శులు కీలక పాత్ర వహించి, బాద్యతగా అభ్యర్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కుదుముల విజయభాస్కర్‌రెడ్డి, ఎంపిఓ చెన్నకేశవులు, కార్యదర్శులు బాబూరావు, శ్రీనివాస్, హన్నా, అనిల్, ప్రభాకర్, యు.నరేష్, నవీన్, పరశురామ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## నూతి ప్రమాణస్వీకారానికి భారీగా తరలిన కాంగ్రెస్ శ్రేణులు

### నూతికి తిలకం దిద్ది హారతి ఇచ్చిన మహిళలు










ప్రజాపక్షం/వైరా: ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా సోమవారం వైరాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు అత్యంత సన్నిహితుడు అయిన నూతి సత్యనారాయణ ప్రమాణస్వీకారానికి సోమవారం పెద్ద ఎత్తున భారీ ర్యాలీతో తరలివెళ్లారు. నూతి సత్యనారాయణ ప్రమాణస్వీకారానికి బయల్దేరిన సందర్భంలో మహిళలు పెద్ద ఎత్తున నుదుట తిలకం దిద్ది హారతి పలికారు. నూతి సత్యనారాయణ నివాసం నుండి ప్రారంభమైన ర్యాలీ ఖమ్మం వరకు కొనసాగింది. ఖమ్మం రెస్టారెంట్ వద్ద పట్టణ కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. వైరాలో కాంగ్రెస్ ప్రమాణస్వీకార ర్యాలీని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ పాల్గొని ప్రారంభించారు. నూతి ప్రమాణస్వీకారం నేపద్యంలో వైరా పట్టణంలో కాంగ్రెస్ శ్రేణులు పండుగ వాతావరణాన్ని చూపించారు. ఈ ర్యాలీ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, జిల్లా నాయకులు బాలాజీనాయక్, మార్కెట్ చైర్మన్ బొళ్ళ గంగారావు, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, మున్సిపాల్ మాజీ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, డాక్టర్ కాపా మురళీకృష్ణ, పమ్మి అశోక్, మాజీ కౌన్సిలర్ బత్తుల గీత, కొప్పురావూరి సుమంత్, ఫణితి సైదులు, పొదిలి హరినాథ్, వేములరత్నాకర్, వీరంశెట్టి సీతారాములు, ఫణితి శ్రీనివాసరావు, మాజీ మార్కెట్ డైరెక్టర్ వేల్పుల మురళి, జవ్వాజి నాగరాజు, మిట్టపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా పోలీసుల విస్తృత తనిఖీలు





ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : గ్రామ పంచాయతీ ఎన్నికలతో పాటు అక్రమ రవాణ నియంత్రణలో భాగంగా పోలీసు కమిషనర్ సునిల్‌దత్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. జనసంద్రమైన ప్రాంతాలు, లాడ్జిలు, బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లలో తనిఖీలు చేపట్టారు. నియోజక వర్గ, మండల కేంద్రాలలోని ప్రధాన రహదారుల్లో వాహనాలు తనిఖీ చేపట్టారు. డ్రంకెండ్రైవ్‌లు నిర్వహించి జరిమానాలు విధిస్తున్నారు. రాత్రి సమయాల్లో రోడ్లపై తిరుగుతున్న వ్యక్తులను విచారించి వివరాలు సేకరిస్తున్నారు. అనుమానితుల నుంచి వేలిముద్రలను సేకరిస్తున్నారు. విజబుల్ పోలీసింగ్‌ను పట్టిష్టంగా అమలు చేస్తేనే నేరాలు అదుపులోఉంటాయని పోలీసు ఆదిశగా తనిఖీలు విస్తృతం చేయాలని పోలీసు అధికారులను పోలీసు కమిషనర్ ఆదేశించారు. బస్టాండ్‌లు, లాడ్జిలు, హోటళ్లలో తనిఖీలు చేపట్టి అనుమానితులను అదుపులోకి తీసుకుని వివరాలు సేకరించి వారి నుంచే సమాధానాల ఆధారంగా వేసులు బాటు ఉంటే వదిలివేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరంగా చేపట్టాలని సూచించారు. అదేవిధంగా జిల్లా , రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి గంజాయి, ఇసుక, రేషన్‌బియ్యం అక్రమరవాణను కట్టడిచేయాలని ఎస్‌హెచ్‌ఓలు, ఏసిపిల ను సిపి ఆదేశించారు.

## నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన సబ్ కలెక్టర్



ప్రజాపక్షం/పెనుబల్లి: ఈ నెల 17 న జరగ నున్న పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మూడో తేదిన నామినేషన్ ప్రక్రియ కొనసాగుతుంది. అందులో భాగంగా మండలం లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను కల్లూరు డివిజన్ సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ పెనుబల్లి మండలంలోని నామిషన్ దరఖాస్తు స్వీకరణ కేంద్రాలను సోమవారం తనిఖీ చేసి పరిశీలించారు. పెనుబల్లి మండలంలో 9 నామినేషన్ స్వీకరణ దరఖాస్తు కేంద్రాలను ఏర్పాటు చేశారు. పెనుబల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో, పెనుబల్లి, వియ్యం బంజర్, తాళ్లపెంట పంచాయతీ కార్యాలయంలో... బ్రహ్మలకుంట, గంగదేవి పాడు, కరాలపాడు, తాళ్లపెంట గ్రామ పంచాయతీలకు లింగగూడెం పంచాయతీ కార్యాలయంలో లింగగూడెం, సారథి పురం, భవన్నపాలెం, లంకపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో లంకపల్లి, కొత్తలంకపల్లి, రామచంద్రపురం ఏరుగట్ల పంచాయతీలకు... రామచంద్ర రావు బంజర్ పంచాయతీ కార్యాలయంలో రామచంద్ర రావు బంజర్, మండాలపాడు, చౌడవరం (కె డబ్ల్యు), పంచాయితీలకు... తెలగవరం కార్యాలయంలో తెలగవరం, కారాయి గూడెం, పాత అగ్రహారం, కందిమల్ల వారి బంజర పంచాయతీలకు, చింతగూడెం పంచాయతీ కార్యాలయంలో చింతగూడెం, కొత్త కారాయి గూడెం, గణేష్ పాడు పంచాయతీలకు, బయ్యన్నగూడెం పంచాయతీ కార్యాలయంలో.. బయన్నగూడెం, కుప్పెనకుంట్ల, తుమ్మలపల్లి, పాత కుప్పెనకుంట్ల పంచాయతీలకు, కొండ్రుపాడు పంచాయితీ కార్యాలయంలో కొండ్రుపాడు, అడవి మలల్లేల, సూరయ్య బంజర తండా పంచాయతీలకు ఎన్నికల దరఖాస్తు స్వీకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ సోమవారం పెనుబల్లి మండల కేంద్రంలోని దరఖాస్తు స్వీకరణ కేంద్రాన్ని పరిశీలించి అధికారులకు పలు ఆదేశాలను జారీ చేశారు. కేంద్రాల వద్ద 500 మీటర్ల హద్దును ఏర్పాటు చేసి 100 మీటర్ల దూరంలో బారికేట్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. నామినేషన్ స్వీకరణ కేంద్రం వద్ద నామినేషన్ స్వీకరణ ప్రక్రియ సజావుగా జరిగే విధంగా అన్ని రకాల చర్యలు చేపట్టాలని మండల ఎన్నికల అధికారులకు సూచించారు. నామినేషన్ స్వీకరణ కేంద్రాల వద్ద వాహనాల రవాణాను నియంత్రించి ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పోలీస్ శాఖని ఆదేశించారు. కేంద్రాల వద్ద గుంపులు గుంపులుగా జనాలు తిరగకుండా నియంత్రించి ఒకే చోట నలుగురికి మించి ఉండకుండా పోలీసు అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నామినేషన్ స్వీకరణ ఆఖరి రోజు ఐదు గంటల లోపు 100 మీటర్ లోపల ఉన్న వారికి టోకెన్లు ఇచ్చి దరఖాస్తు స్వీకరణకు అనుమతి ఇవ్వాలని ఎన్నికల నిర్వహణ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్ యాదవ్, ఎంపీడీవో అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవానికి తరలి రావాలి

### - ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభం
### - ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : పాల్వంచ ప్రాంతంలో నూతనంగా స్థాపించబడుతున్న చారిత్రాత్మక డా. మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విచ్చేస్తున్నందున ఈ కార్యక్రమానికి తరలిరావాలని కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని కొత్తగూడెం జిల్లాలో డా.మన్మోహన్ సింగ్ ఎర్త్ యూనివర్సిటీ స్థాపన గర్వకారణం అని తెలిపారు. డిసెంబర్ 2న జరిగే ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రితో పాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, జిల్లా ఇంచార్జ్ మంత్రి వాకిటి శ్రీహరి, వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామిరెడ్డి, పోరిక బలరామ్ నాయక్, ఉమ్మడి ఖమ్మం జిల్లా శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు హాజరవుతున్నట్లు కూనంనేని తెలిపారు. ప్రారంభ కార్యక్రమానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కూనంనేని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## పాఠశాల అభివృద్ధికి ఆర్థికసాయమందించిన ఆర్ఎంపి

### వంట షెడ్డు నిర్మాణానికి రూ. 20 వేలు అందజేత



ప్రజాపక్షం/జూలూరుపాడు: విద్యార్థుల భవిష్యత్ తరగతి గదిలో రూపు దిద్దుకుంటుంది. నేటి బాలలే రేపటి భావిపౌరులుగా తీర్చిదిద్దేది పాఠశాలల్లోనే. అందుకే గుడికి చేసే ఉపకారం కంటే బడికి చేసే సాయం ఎక్కువ అంటారు. అటువంటి పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి విద్యార్థులకు ఉపయోగపడే పనుల కోసం ఓ ఆర్ఎంపీ వైద్యురాలు తాము సంపాదించిన దాంట్లో కొంత మొత్తాన్ని పాఠశాలలకు విరాళంగా అందించి పాఠశాల, విద్యాభివృద్ధికి సహకరిస్తున్నారు. జూలూరుపాడు మండల కేంద్రంలోని కళావతి ప్రథమ చికిత్స కేంద్రం మహిళా వైద్యురాలు కుసుమ గత 14 సంవత్సరాలుగా జూలూరుపాడులో వైద్య సేవలు అందిస్తూ పేదవారికి ఫీజు లేకుండా ఉచితంగా వైద్యం చేస్తూ తనకు చేతనైన సహాయం చేస్తూ ఉన్నారు. మండల పరిధిలోని సూరారం ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలకు వంట షెడ్డు లేక ఇబ్బంది పడుతున్నారన్న విషయం పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుల ద్వారా తెలుసుకున్న తను తనవంతుగా వంటషెడ్ నిర్మాణం కోసం 20000 రూపాయలు ఆర్థిక సహాయం చేస్తానని ప్రస్తుతం పనులు మొదలు పెట్టడం కోసం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్ రెడ్డి, టీచర్ నరసింహారావు లకు పదివేల రూపాయలు అందజేశారు. తదుపరి నిర్మాణంలో భాగంగా మిగతా పదివేలు అందజేస్తానన్నారు. 20 వేల రూపాయలు ఆర్థిక సాయం చేసిన ఆర్ఎంపీ వైద్యురాలు కుసుమకు ఉపాధ్యాయులు, సూరారం గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## పంచాయితీలలో నామినేషన్ల పరిశీలనలో తిరస్కరణలు



ప్రజాపక్షం/అశ్వాపురం: మండలంలోని పంచాయితీలలో సర్పంచ్, వార్డులకు వేసిన నామినేషన్ల పరిశీలనలో కొన్ని నామినేషన్‌లు తిరస్కరణ చేయడం జరిగిందని ఎంపీడీవో రవీంద్రనాథ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 24 గ్రామ పంచాయితీలకు 214 వార్డులు ఉన్నాయని, ప్రభుత్వం ప్రకటించిన పంచాయితీ రిజర్వేషన్లలో సర్పంచ్ అభ్యర్థులుగా వేసిన నామినేషన్లు 127, వార్డు అభ్యర్థులుగా వేసిన నామినేషన్లు 533 వీటిలో అత్యధికంగా మొండికుంట గ్రామ పంచాయితీ నుండి 15 సర్పంచ్ అభ్యర్థి నామినేషన్లు, అత్యల్పంగా సంద్రల బోడు పంచాయితీ నుండి సర్పంచ్ అభ్యర్థి నామినేషన్లు 2, వార్డులలో అత్యధికంగా 16 వార్డులు(అశ్వాపురం)ఉన్న పంచాయితీలకి 49 నామినేషన్లు అత్యల్పంగా 4 వార్డులు(మనుబోతుల పాడు)ఉన్న పంచాయితీకి 12 నామినేషన్లు వచ్చాయన్నారు. మండలంలో సర్పంచ్, వార్డు మెంబర్ నామినేషన్లు పరిశీలనలో తిరస్కరించబడ్డ వాటి వివరాలను ప్రకటిస్తూ అశ్వాపురం మండల వ్యాప్తంగా సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్లలో మల్లెలమడుగు సర్పంచ్ అభ్యర్థికి వేసిన నామినేషన్‌లో 2 సెట్లు ముగ్గురు వేశారని, వారిలో ఒక్కొక్క సెట్టు పరిశీలనలో తిరస్కరించబడిందని, మండల వ్యాప్తంగా వార్డులకై వేసిన నామినేషన్లలో అశ్వాపురం పంచాయితీలో 3 వ వార్డు స్త్రీ రిజర్వేషన్‌గా ఉన్న వార్డులో పురుషుడు అయిన గాదె శ్రీకాంత్ నామినేషన్ వేయడం వలన తిరస్కరణ, 5 వార్డులో స్త్రీ రిజర్వేషన్‌గా ఉన్న వార్డులో పురుషుడైన బడేటి ప్రవీణ్ కుమార్ నామినేషన్ వేసిన కారణంగా తిరస్కరించామని, 16వ వార్డు పోటీ చేసే వార్డు నామినేషన్ వేసిన అభ్యర్థి మట్టా వీర భద్రా రెడ్డిని ఇతర వార్డులో ఉన్న వ్యక్తి బలపరడం వలన తిరస్కరించామని, గొందిగూడెం పంచాయితీలో 1వ వార్డులో పోటీ చేసే అభ్యర్థిని తాటి భూమిక వయస్సు ఎన్నికల పోటీకి సరిపడా లేనందున తిరస్కరించామని, చింతిర్యాల పంచాయితీలో 5వ వార్డు స్త్రీకి కేటాయించబడిన రిజర్వేషన్లు పురుషుడైన తెల్లం వెంకటేశ్వర్లు పోటీ చేయడం వలన పరిశీలనలో తిరస్కరించబడ్డాయని అన్నారు. నామినేషన్ ఉపసంహారణకు ఈనెల 3వ తేదీ వరకు అవకాశం ఉందని తెలిపారు.

## ఉద్యోగ ఉపాధ్యాయులకు పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలి



ప్రజాపక్షం/ములకలపల్లి: ఉద్యోగ ఉపాధ్యాయులకు పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలని టీఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెంపాటి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం ములకలపల్లి మండల తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల శాఖ 12వ మహాసభ మండల అధ్యక్షులు మెండి కిషోర్ అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు సంబంధించిన అన్ని రకాల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, పెన్షనర్లకు సంబంధించిన అన్ని రకాల బకాయిలు వెంటనే చెల్లించాలని, అదే విధంగా ఉపాధవ్యాయులను ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ నుండి మినహాయించాలని, గతంలో ప్రభుత్వం ఇచచిన మినహాయింపను ఉద్దేశించి మాత్రమే ఉపాధ్యాయులు టెట్ పరీక్ష రాయలేదని, ఇప్పుడు ఆకస్మాత్తుగా ఐదు సంవత్సరాలు సర్వీస్ కలిగిన ఉపాధ్యాయులు అందరూ తాము సర్వీస్‌లో కొనసాగాలంటే, ప్రమోషన్ పొందాలంటే ఉపాధ్యాయులు తప్పక ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ పాస్ కావాలని నిబంధన విధించడం సరి కాదని అన్నారు. ఈ మండల మహాసభలో సంవత్సర కాలంగా జరిగిన కార్యకలాపాల నివేదికను ప్రధాన కార్యదర్శి లావుడియా అశోక్ ప్రవేశపెట్టగా ప్రతినిధులు చర్చించి ఆమోదించారు. అనంతరం మండల శాఖకు ఎన్నికల అధికారి రాష్ట్ర కమిటీ సభ్యులు బి రాజు, అబ్జర్వర్లుగా జిల్లా కార్యదర్శులు ఎం రాజేశ్వరరావు, పాషా వ్యవహరించారు. మండల నూతన కమిటీ అధ్యక్షులుగా బి లక్ష్మ ణ్, ప్రధాన కార్యదర్శిగా ఎం కిషోర్, ఉపాధ్యక్షులుగా కే సంతోష్ కుమార్, పి జానకీ దేవి, కోశాధికారిగా కే శ్రీరామ్, కార్యదర్శులుగా ఎల్ అశోక్, బి లక్ష్మ ణ్, వి కిరణ్ కుమార్, వి రామచంద్రు, ఆడిటర్‌గా రహీముద్దీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## ఎన్నికల కోడ్ ఉండగా సిఎం ఎట్లా పర్యటిస్తారు : రేగా



ప్రజాపక్షం/మణుగూరు: రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ఉండగా జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎలా పర్యటిస్తాడు అని సోషల్ మీడియా వేదిక రేగా కాంతారావు హాట్ కామెంట్స్ చేశారు. ముఖ్యమంత్రి పర్యటనపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు. ఎన్నికల కోడ్ ఉండగా ప్రభుత్వ సొమ్ముతో పర్యటన దుర్మార్గమన్నారు. ఎన్నికలు వస్తే మంత్రులకు, ముఖ్యమంత్రికి భయమని రేగా కాంతారావు సోషల్ మీడియా వేదిక కామెంట్స్ చేశారు.ముఖ్యమంత్రి పర్యటన నిలిపివేయాలని రేగా సోషల్ మీడియా వేదికగా తెలిపారు.

## ఆకస్మికంగా పీహెచ్‌సి తనిఖీ



ప్రజాపక్షం/ఏన్కూరు : ఏన్కూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం కల్లూరు డివిజన్ డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ ఎం. ప్రదీప్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులకు అందే వైద్య సేవలు,ఆరోగ్య కార్యక్రమాల పురోగతిని సమీక్షించినారు. జాతీయ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని వ్యాధిపై అవగాహన కల్పించారు. గర్భిణీ స్త్రీలకు ఎయిడ్స్ పై ప్రత్యేక అవగాహన సదస్సును నిర్వహించారు. అనంతరం స్థానిక గురుకుల విద్యాలయంలో విద్యార్థులకు ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తి, నివారణ, నిర్మూలన పై పూర్తి అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ భూక్య రాములు, కల్లూరు డివిజన్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, హెల్త్ ఎడ్యుకేటర్ వేణుగోపాల్, కళాశాల ప్రిన్సిపాల్ వేము రాజు, పీహెచ్ ఎన్ పుణ్యవతి హెల్త్ అసిస్టెంట్ దుర్గా ప్రసాద్, ఏఎన్ఎం రమణ, ఆశ వర్కర్ కమల తదితరులు పాల్గొన్నారు.

## పలు కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరిక



ప్రజాపక్షం/జూలూరుపాడు: మండల పరిధిలోని గుండెపుడి గ్రామ పంచాయితీలో దుద్దుకూరి సుమంత్ ఆధ్వర్యంలో (బిఆర్ఎస్) పార్టీ నుండి పలు కుటుంబాలు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి గ్రామ పెద్దలు కాళ్లూరి వెంకటేశ్వరావు, కొమ్మినేని కృష్ణమూర్తి, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు గాదె కృష్ణయ్య వారికి కండువాలు కప్పి సాధారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సుమంత్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం అన్నారు. పేదలకు ఉచిత కరెంటు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్ళు, రేషన్ కార్డులు, ఉచిత బస్సు, రుణమాఫీ, వరికి బోనస్ ఇలా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేస్తూ అలాగే అభివృద్ధి చేస్తూ ముంఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుకు పోతున్నారని, కాబట్టి ప్రజలు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి, వైరా శాసన సభ్యులు మాలోతు రాందాస్ నాయక్ అండగా ఉండాలన్నారు. రాబోయే సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. అదే విధంగా మనతో కలిసి వచ్చే మిత్ర పక్షాలను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు కళ్యాణపు నరేష్, జవ్వాది వీరయ్య, గోగుల వెంకటేశ్వర్లు, ఆనంగంటి ధనమయ్య, చింతకాయల శ్రీను, గాదె సురేష్, బోడ హరి బాబు, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : గ్రామపంచాయితీ ఎన్నికలు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా నిర్వహించాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు సర్వేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం ఎన్నికల అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నోడల్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు, ప్రశాంత, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో భద్రత కట్టుదిట్టం చేయాలన్నారు. మొదటి దశ నామినేషన్ల ప్రక్రియ పూర్తయిందని, రెండోదశ కొనసాగుతోందన్నారు. అనంతరం ఎన్నికల వ్యయ పరిశీలకురాలు లావణ్య మాట్లాడుతూ అభ్యర్థులు ఓటర్లను ప్రలోబాలకు గురిచేయకుండా నియంత్రణ చర్యలు అమలు చేయాలన్నారు. అభ్యర్థుల ఖర్చు, పత్రికా ప్రచారం, సోషల్ మీడియా వ్యూహాలు వంటి అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె స్పష్టం చేశారు. అదేవిధంగా పాల్వంచ మండల పరిధిలోని ఉల్వనూరు, బంజర, సత్యనారాయణ పురం, కోడిపుంజుల వాగు గ్రామపంచాయితీలను సందర్శించి నామినేషన్ల ప్రక్రియను సర్వేశ్వరరెడ్డి పరిశీలించి ఏర్పాట్లు పరిశీలించారు. నామినేషన్ల ప్రక్రియ ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని, అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సిఇఓ సంజీవరావు, ఇంచార్జ్ డిపిఓ సుధీర్, పౌరసరఫరాల మేనేజర్ త్రినాధ్, అడిషనల్ డిఆర్‌డిఓ రవి, ఏఓలు, ఏఇఓలు తదితరులు పాల్గొన్నారు.

# ధన్యజీవి మేడా భూషయ్య

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని





ప్రజాపక్షం/ఏన్కూరు : ధన్యజీవి మేడా భూషయ్య అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. భారత కమ్యూనిస్ట్ పార్టీ ఏన్కూర్ మండల సీనియర్ నాయకులు అమర జీవి మేడా భూషయ్య సంస్మరణ సభ ఏన్కూర్ వారి స్వగృహం లో జరిగింది. ఈ సంతాప సభ సీపీఐ మండల కార్యదర్శి జాగర్లమూడి రంజిత్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంత్ రావు మాట్లాడుతూ, మేడా భూషయ్య భారత కమ్యూనిస్ట్ పార్టీ ని ఏ న్కూర్ గ్రామంలో పార్టీని పెంచడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ నీ గెలిపించడంలో వారి పాత్ర కీలకం అన్నారు. పార్టీకి గడ్డు పరిస్థితులు వచ్చిన పార్టీకి పెద్ద దిక్కుగా ఉండి కార్యకర్తలకు ధైర్యం నింపుతూ పార్టీ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. ఆరోగ్యం బాగా లేనప్పటికీ పార్టీ ఇచ్చిన అన్ని కార్యక్రమాల్లో పాల్గొన్నారు అని అన్నారు. సీనియర్ నాయకులుగా పార్టీకి చేసిన సేవలు మరిచిపోలేనివి అన్నారు. వారికి వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ సంతాప సభకు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జితేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు దొండపాటి రమేష్, జిల్లా నాయకులు తెప్పాల సత్యం, అమరనేని వీరభద్రమ్, చంద్ర నరేంద్ర కుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు, దొంతిబోయిన నాగేశ్వరావు, కాంగ్రెస్ నాయకులు విజయ బాయి, టిడిపి నాయకులు తాళ్లూరి అప్పారావు, జనార్ధన్ మండలంలోని వివిధ పార్టీ ప్రముఖులు, నాయకులు పాల్గొన్నారు.

# ఏపీ టూ తెలంగాణ వయా కట్టుకాచారం..!

-భారీగా ధాన్యం అక్రమంగా తరలింపు

-బోనస్ కోసం ఏపీ నుంచి తెలంగాణకు..



ప్రజాపక్షం/నేలకొండపల్లి : తెలంగాణ సరిహద్దు గ్రామం, ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని కట్టుకాచారం గ్రామంలో సోమవారం ఏపీ నుంచి సూర్యాపేట జిల్లా కు వస్తున్న 8 ధాన్యం లారీలను స్థానికులు అడ్డుకున్నారు. లారీ డ్రైవర్లు ను నిలదీయగా వారి వద్ద నకిలీ ట్రక్ షీట్స్ తో తెలంగాణ ప్రభుత్వం క్వింటా కు రూ.500 బోనస్ ను నొక్కేందుకు అక్రమానికి తెర లేపారు. ఏపీ నుంచి ప్రతీ సీజన్ లో వందల లారీల ధాన్యం ను తెలంగాణ కు తరలిస్తున్నారు. ఏపీ లోని బడా వ్యాపారులు ఆంధ్రప్రదేశ్ లో తక్కువ ధరకు ధాన్యం ను కొనుగోలు చేసి తెలంగాణ లోని మద్దతు ధర తో పాటు, బోనస్ ను కూడ కొల్లగొడుతున్నారు. అక్రమార్కులకు అధికార యంత్రాంగం సహకరిస్తుందనే విమర్శలు వినవస్తున్నాయి. స్థానిక అధికారుల ప్రమేయం లేకుండా ఏపీ నుంచి ధాన్యం ను విక్రయించటం సాధ్యమా అని ప్రశ్నిస్తున్నారు. వందలాది లారీలను ఏపీ నుంచి తెలంగాణ కు వస్తుంటే జిల్లా అధికార యంత్రాంగం కు తెలిసినప్పటికీ పట్టించుకోవటం లేదు. గతంలో నేలకొండపల్లి మండలం లోని చెరువుమాధారం వద్ద దాదాపు 30 లారీలను స్థానికులు నిలిపివేశారు. కానీ అధికారులు పట్టుకుని వదిలేశారు. ఇదే అదునుగా భావించి ఈ ఏడాది కూడ ధాన్యం ను తరలిస్తున్నారు. దీని వలన కోట్ల రూపాయలు బోనస్ ను ఏపీ కి చెందిన బడా వ్యాపారులు దోచుకుంటున్నారు. ఏపీ కిచెందిన లారీలు ప్రతీ రోజు అక్రమంగా సరిహద్దు దాటుతున్నాయి. స్థానికులు సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చిన పట్టించుకోవటం లేదని...పైగా వారితో బేరసారాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. సోమవారం 8 లారీలు సూర్యాపేట వెళ్తున్న విషయం ను తెలుసుకుని గ్రామస్తులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ విజయ్బాబు ఘటనా స్థలం కు చేరుకుని వివరాలు సేకరించారు. పంచనామా నిర్వహించి ధాన్యం లారీలను స్థానిక పోలీస్ స్టేషన్ లో అప్పగించారు. కాగా ఏపీ నుంచి ఇంత పెద్ద ఎత్తున జిల్లాలోకి ప్రవేశిస్తుంటే, అధికార యంత్రాంగం పట్టించుకోకపోవటం పై పలు విమర్శలు వినవస్తున్నాయి. ముదిగొండ మండలం లోని వల్లభి లో చెకోపోస్టు ఉండటం తో నేలకొండపల్లి మండలం లోని కట్టుకాచారం మీదుగా సూర్యాపేట కు వెళ్లేందుకు అక్రమారులు మార్గం ను ఎంచుకున్నారు. నేలకొండపల్లి మండలం లోని కట్టుకాచారం మీదుగా సూర్యాపేట కు వెళ్లేందుకు అక్రమారులు మార్గం ను ఎంచుకున్నారు. నేలకొండపల్లి మండలంలోని రాష్ట్ర సరిహద్దు లో నిఘా లేకపోవటంతో ఏపీ అక్రమార్కులకు రాజమార్గం గా మారింది. దీనికి తోడు గ్రామస్తులు సమాచారం ఇచ్చిన నిమ్మకునీరెత్తినట్లు గా వ్యవహరిస్తున్నారని అధికారుల తీరు పై స్థానికులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడ పట్టించామని...కానీ అధికారులు హడావుడి చేసి, చేతులు దులుపుకుంటున్నారు. మరుసటి రోజే అక్రమం దర్జాగా చేస్తున్నారని రైతులు మండిపడ్డారు. ఇప్పటికైనా ఏపీ నుంచి అక్రమ ధాన్యం ను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని రైతులు కోరుతున్నారు.

# ఎన్నికల నిబంధనలకు తిలోదకాలు ఇస్తున్న సిఎం

-బిసిలను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్

-ముగ్గురు మంత్రులున్నా అభివృద్ధి శూన్యం



ప్రజాపక్షం/ ఖమ్మం : ఎన్నికల నిబంధనలకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తిలోదకాలు ఇచ్చారని శాసన మండలి సభ్యులు, బిఆర్ఎస్ అధ్యక్షులు తాతా మధుసూదన్ ఆరోపించారు. గ్రామ పంచాయితీ ఎన్నికలకు సంబంధించి కోడ్ అమల్లో ఉన్న సమయంలో జిల్లాల పర్యటన ఎలా చేస్తారని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల సంఘం తక్షణం చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి పర్యటన స్థానిక సంస్థల ఓటర్లను ప్రభావితం చేసే అవకాశం ఉందని ఆయన అన్నారు. సోమవారం తెలంగాణ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో తాతా మధుసూదన్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం జోక్యం చేసుకుని పర్యటనలను నిలుపుదల చేయాలని ముఖ్యమంత్రి దిగజారుడు ప్రకటనలు చేయడం ద్వారా ఎన్నికల విలువలను దిగజారుస్తున్నారని ఆయన తెలిపారు. రెండేళ్లుగా ఖమ్మం జిల్లా అభివృద్ధి పూర్తిగా నిలిచి పోయిందని ముగ్గురు మంత్రులున్నా ఉపయోగం లేకుండా పోయిందన్నారు. రైతులు దగా పడుతున్నారని యూరియా కోసం పడిగాపులు కాశారని ఒక మాటలో చెప్పాలంటే రైతులను ఈ ప్రభుత్వం శత్రువులుగా చూస్తుందని ఆయన అన్నారు. బిసిలకు తీరని అన్యాయం చేసిందని 22.2 శాతం చెప్పిన బిసిలకు 127 గ్రామ పంచాయతీలు రావాలని కానీ 54 మాత్రమే వచ్చాయని ఇది కాంగ్రెస్ చేసిన ద్రోహమని ఆయన తెలిపారు. రైతులు, పేదలు, నిరుద్యోగులు, యువత ఇలా అందరిని కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. త్వరలోనే ఈ దుర్మార్గపు పాలనకు తెరపడుతుందని ఆయన తెలిపారు. మీడియా సమావేశంలో బిఆర్ఎస్ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, డిసిసిబి మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, నాయకులు బిచ్చాల తిరుమలరావు, తాజుద్దీన్, శేషు, నరేందర్, మగ్బూల్, మాటేటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# 10 మంది అధికారులకు షోకాజ్ నోటీసులు

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఎన్నికల శిక్షణా కార్యక్రమానికి గైర్హాజరైన 10 మంది అధికారులకు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సోమవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పంచాయతీ ఎన్నికల్లో భాగంగా నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి 10 మంది అధికారులు ఎటువంటి ముందస్తు సమాచారం అందించకుండా గైర్హాజరు కావడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికల విధులు చాలా కీలకమని వీటిని సరిగ్గా నిర్వహించేందుకు సిబ్బందిని సన్నద్ధం చేసేందుకు శిక్షణా తరగతులు ఏర్పాటు చేస్తే వాటికి హాజరు కాని 10 మంది అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ వీరిపై కఠిన చర్యలు ఎందుకు తీసుకోవద్దో వెంటనే సమాధానం ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు.

# రైతుల సంక్షేమమే లక్ష్యం



ప్రజాపక్షం/నేలకొండపల్లి : మధుకాన్ షుగర్ అండ్ పవర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ నష్టాలలో ఉన్నప్పటికీ రైతులు, సిబ్బంది సంక్షేమం కోసం ముందుకు సాగుతున్నట్లు ఫ్యాక్టరీ వ్యవస్థాపకులు, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు అన్నారు. మండలం లోని రాజేశ్వరపురం వద్ద నున్న మధుకాన్ షుగర్ ఫ్యాక్టరీ లో సోమవారం క్రషింగ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫ్యాక్టరీ అభివృద్ధికి యం.డీ.కృష్ణయ్య నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. ఫ్యాక్టరీ అభివృద్ధి కి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. చెరుకు మరింత సాగు చేసి ఫ్యాక్టరీ అభివృద్ధి కి పాటుపడాలని సూచించారు. రైతు సోదరుల కోరిక మేరకు ఉచితంగా అందిస్తున్న పావుకిలో పంచదారను మరో పావుకిలో అదనంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కేన్ కమిషనర్ పాల్గొన్నారు.

# ఆచార్లగూడెం ఏకగ్రీవంకు నామినేషన్లు



ప్రజాపక్షం/నేలకొండపల్లి: స్థానిక పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్లు రెండో రోజు జోరుగా జరిగింది. మండలం లోని 32 గ్రామ పంచాయతీ లలో నామినేషన్ల కు ప్రక్రియ ను చేపట్టారు. 10 నామినేషన్ కేంద్రాలలో నామినేషన్లు వేయటానికి డప్పు, వాయిద్యాలతో భారీ ర్యాలీ నడుమ నామినేషన్లు సందడి నెలకొంది. ఆచార్లగూడెం గ్రామ పంచాయతీ ఎస్సీ మహిళకు రిజర్వ్ చేయటంతో అన్ని పార్టీలు సమావేశం ను నిర్వహించి ఏకగ్రీవం చేసుకునేందుకు సింగిల్ నామినేషన్ వేశారు. సర్పంచ్, 8 వార్డులకు నామినేషన్ వేశారు. నేలకొండపల్లి మేజర్ పంచాయతీ కాంగ్రెస్ అభ్యర్థి పసుపులేటి శ్రీలత భారీ ర్యాలీ నడుమ నామినేషన్ దాఖలు చేశారు. మోటాపురం లో సొసైటి మాజీ డైరెక్టర్ రావెళ్ల కృష్ణారావు నామినేషన్ వేశారు. నామినేషన్ కేంద్రాలను జిల్లా పరిషత్తీఈవో దీక్షా సందర్శించారు. ఏర్పాట్లు గురించి చర్చించారు.

# వైద్యుల నిర్లక్ష్యంగానే మా బాబు మృతి




ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు వంద పడకల ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యంగానే బాబు మృతి చెందారని బాబు తండ్రి శంకర్, కుటుంబ సభ్యులు ఆరోపించారు. పినపాక మండలం భూపాలపట్నం గ్రామానికి చెందిన తోలెం అరుణ ప్రసవం కోసం పినపాక ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లారు. అక్కడి వైద్యులు మణుగూరు ఆస్పత్రికి రిఫర్ చేశారు. దీంతో ప్రసవం కోసం మణుగూరు వంద పడకల ఆసుపత్రికి వచ్చారు. అరుణకు సర్జరీ చేసి ప్రసవం చేయాల్సిన సమయంలో సాధారణ ప్రసవం కోసం ప్రయత్నాలు చేశారని దీంతో శిశువు మృతి చెందిందని శిశువు తండ్రి ఆరోపించారు. అంతే కాకుండా మృతి చెందిన శిశువును గోప్యంగా ఉంచి ఆక్సిజన్ పెట్టి భద్రాచలం తరలించారని, శిశువును పరీక్షించిన భద్రాచలం డాక్టర్లు మృతి చెంది చాలా సమయం గడిచిందని వెల్లడించారన్నారు. తమ బాబు డాక్టర్ల నిర్లక్ష్యం వలనే మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ విషయమై చికిత్స చేసిన డాక్టర్ పద్మను వివరణ కోరగా.. నార్మల్ గా డెలివరీ అయ్యే ఛాన్స్ (హెడ్ ఆన్ పెరినియం) ఉన్నప్పుడు ఆప రేషన్ చేయలేమని ఆ స్టేజీలో ఆపరేషన్ చేస్తే తల్లికి ప్రమాదమని తెలిపారు.

# రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు : ఎస్ఐ



ప్రజాపక్షం/కల్లూరు: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రెచ్చగొట్టే పోస్టులుపెడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హరిత హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులోఉన్నందున సోషల్ మీడియాలో ప్రత్యర్థులపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇతరుల మనోభావాలు దెబ్బతినేలా దుష్ప్రచారం చేసే వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఏదైనా ఇతరులకు హాని కలిగించే పోస్టులు షేర్ చేసిన నేరంగా పరిగణించి గ్రూప్ అడ్మిన్ కూడా బాధ్యులనుగా చేసి కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కనుక సోషల్ మీడియా లో ప్రచారం చేసే వ్యక్తులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సూచించారు. ప్రస్తుతానికి సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న వాటిపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. అదే విధంగా గ్రామాల్లో గొలుసుకట్టు దుకాణాలు నిర్వహించే వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నట్లు వివరించారు.

# నేడు భూ విజ్ఞాన శాస్త్ర విశ్వవిద్యాలయం ప్రారంభం



**- అధికారులంతా సమన్వయంతో పనిచేయాలి**
**- ఏర్పాట్లను పరిశీలించిన తుమ్మల**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పాల్వంచ ప్రాంతంలో డా మన్మోహన్ సింగ్ భూ విజ్ఞాన శాస్త్ర విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించనున్నారని, కార్యక్రమం విజయవంతానికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని రాష్ట్రవ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఈ మేరకు సోవవారం ఆయన యూనివర్సిటీ ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రారంబోత్సవాన్ని పురస్కరించుకుని యూనివర్సిటీ ప్రాంగణాన్ని అందంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో తొలి పూర్తిస్థాయి భూ విజ్ఞాన శాస్త్ర విశ్వవిద్యాలయంగా అవతరించబోయే ఈ ప్రతిష్టాత్మక విద్యా సంస్థ ప్రారంభోత్సవానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. నేడు అధికారికంగా ప్రజలకు అంకితం కానుందని చెప్పారు. ఈ ప్రాతంలో విస్తారమైమ బొగ్గ గనులు, ఖనిజ వనరులు, భూమి అంతర్గత నిర్మాణానికి గల విశిష్టతల నేపథ్యంలో గతంలో స్థాపించిన మైనింగ్ కాలేజీని ఆధునీకరించి భూ విజ్ఞాన శాస్త్ర విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దేంకు ప్రభుత్వ చొరవ తీసుకోవడం అభినందనీయం అన్నారు. ఈ విశ్వవిద్యాలయం కేంద్రంగా అత్యున్నత పరిశోధనలు జరగనున్నాయని, ఇక్కడికి స్థానిక విద్యార్థులతో పాటు దేశవిదేశాలకు చెందిన ఎందరో విద్యార్థులు శాస్త్రవేత్తలు, అధ్యాపకులు తరలిరానున్నారని అన్నారు. కోల్‌మైన్స్ కార్యకలాపాలకు కేంద్రంగా ఉన్న కొత్తగూడెం ప్రాంత ప్రత్యేక అవసరాలను దృష్టిలో పెట్టుకుని భూకంప విశ్లేషణ, వరదల అధ్యయనం, భూ గర్భ జలాల పరిశోధన, ఖనిజ సంపద అన్వేషణ శాస్త్రీయ వేదికగా ఈ విశ్వవిద్యాలయం నిలవనుందన్నారు. ఈ విదేక శాస్త్రీయ ప్రపంచంలో మైలురాయిగా నిలవనుందని మంతిర తెలిపారు. నేడు జరిగే కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరూ విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రక్తం ద్వారా సంక్రమించే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**- ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవంలో అవగాహన**
**- జిల్లా వైద్యాధికారి తుకారామ్ రాథోడ్**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** రక్తం ద్వారా సంక్రమించే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి డా.తుకారామ్ రాథోడ్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైధానంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, దాక్కు సహకారంతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా రాథోడ్ మాట్లాడుతూ హెచ్ఐవి, హెపటైటిస్ బి,సి వంటి సంక్రమిత వ్యాధులు రక్తం ద్వారా వ్యాప్తి చెందుతాయని చెప్పారు. యువత చెడు వ్యసనాల భారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని, ఎవరి ఆరోగ్యాన్ని వారు కాపాడుకునేందుకు ప్రతీ ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని ప్రత్యేక జ్యూడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రాజమల్లు అన్నారు. అదే విధంగా డా సైదులు మాట్లాడుతూ మొబైల్ వాడకం అధికంగా ఉన్న ఈ రోజుల్లో హెచ్ఐవిపై పూర్తి అవగాహన పెంచుకుని విద్యార్థులు చదువుల్లో రాణించాలని సూచించారు. హెచ్ఐవి సోకి చికిత్సలు పొందుతున్న వారికి ప్రభుత్వం ఉండి అందుతున్న సేవలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డా. తేజస్విని వివరించారు. సురక్షిత లైంగిక సంబంధాలు, సురక్షిత రక్తమార్పిడి వంటివి పాటించాలని, ట్యాటూలు వేయించుకునే విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, హచ్ఐవి అంటుకునే వ్యాధికాదని, అంటించుకునే వ్యాధని, ఈ వ్యాధిపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించే వారికి మెమోంటోలు ప్రధానం చేశారు. అనంతరం కళాజాతాల ప్రదర్శనతో ప్రజలకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది, వైద్యులు, మెడికల్ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్నాయి.

# పినపాక నియోజకవర్గంలో ఐదు మండలాల్లో మొదటి విడత..!

**-95 పంచాయతీలకు ఎన్నికలు**
**- సర్పంచ్‌లకే అత్యధికంగా నామినేషన్లు**

**ప్రజాపక్ష/మణుగూరు:** పినపాక నియోజకవర్గంలో ఐదు మండలలోని 95 పంచాయితీలకు మొదటి విడతలో ఎన్నికలు జరగనున్నాయి. గతంలో కంటే అత్యదికంగా సర్పంచ్ స్ధానానికి నామినేషన్లు రావటం జరిగింది. పినపాక మండలలోని 23 పంచాయితీలలో సర్పచ్ స్థానానికి 121 మంది అభ్యర్థులు పోటిలో ఉన్నారు. కరకగూడెం మండలంలోని 16 పంచాయితీలలో సర్పంచ్ స్ధానానికి 57 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.మణుగూరు మండలంలోని 14 పంచాయితీలకు 65 మంది అభ్యర్థులు పోటిలో ఉన్నారు. అశ్వాపురం మండలంలోని 24 పంచాయితీలకు 127 మంది అభ్యర్థులు పోటిపడుతున్నారు. బూర్గంపాడు మండలంలోని18 పంచాయితలకు 104 మంది అభ్యర్థులు పోటిపడుతున్నారు. మణుగూరు మండల పరిధిలోని బుగ్గ గ్రామపంచాయితీలో సర్పంచ్‌కి 3 గురు పోటిలో ఉండగా 6వార్డులకు 11 మంది పోటి పడుతున్నారు. దమ్మక్కపేట పంచాయితీలో సర్పంచ్‌గా 3గురు బరిలో ఉండగా,8 వార్డులకు గాను 24 మంది అభ్యర్థులు పోటిలో ఉన్నారు. గుట్టమల్లారం పంచాయితీలో సర్పంచ్‌గా ఐదుగురు పోటిలో ఉండగా, 8వార్డులకు గాను 19 మంది అభ్యర్థులు పోటిలో ఉన్నారు. ఇప్పల సింగారం పంచాయితీలో సర్పంచ్‌గా ముగ్గురు పోటిలో ఉండగా,10 వార్డులకు గాను 20 మంది అభ్యర్థులు పోటి పడుతున్నారు. కట్టుమల్లారం పంచాయితీలో సర్పంచ్‌గా ముగ్గురు పోటిలో ఉండగా,8 వార్డులకు గాను 17 మంది పోటిపడుతున్నారు. కునవరం పంచాయితీలో 7గురు సర్పంచ్ స్ధానానికి పోటి పడుతుండగా,16 వార్డులకు గను 52 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. లంకమల్లారం పంచాయితీలో సర్పంచ్‌గా ఇద్దరు పోటిలో ఉండగా, 6వార్డులకు గాను 19 మంది అభ్యర్థులు పోటి పడుతున్నారు. తొగ్గూడేం పంచాయితీలో సర్పంచ్‌గా 4గురు పోటిలో ఉండగా,8 వార్డులకు గాను 18 మంది అభ్యర్థులు పోటి పడుతున్నారు. తిర్లాపురం పంచాయితీలో సర్పంచ్ స్థానానికి 7గురు పోటిలో నిలవగా,8 వార్డులకు గాను 37 మంది అభ్యర్థులు పోటి పడుతున్నారు. సమితి సింగారం పంచాయితీలో సర్పంచ్‌గా 6గురు పోటిలో ఉండగా,16 వార్డులకు టీను 56 మంది అభ్యర్థులు పోటిలో ఉన్నారు. సాబాయిగూడెం పంచాయితీలో సర్పంచ్‌గా 5గురు బరిలో ఉండగా, 8వార్డులకు గాను 27 మంది అభ్యర్థులు పోటిలో ఉన్నారు. రామానుజవరం పంచాయితీలో సర్పంచ్‌గా5గురు పోటిపడుతుండగా, 12 వార్డులకు గాను 55 మంది అభ్యర్థులు పోటిలో ఉన్నారు. పగిడేరు పంచాయితీ పరిధిలో సర్పంచ్‌గా 6గురు పోటిలోఉండగా, 10 వార్డులకు గాను 22 మంది అభ్యర్థులు పోటి పడుతున్నారు. ముత్యాలమ్మ నగర్ పంచాయితీ పరిధిలో సర్పంచ్‌గా 4గురు పోటిలో ఉండగా, 8వార్డులకు గాను 28 మంది అభ్యర్థులు పోటి పడుతున్నారు.

# బెల్టుషాపుల అమ్మకాలను నియంత్రించాలి

**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** గ్రామపంచాయతీ ఎన్నికల సజావుగా జరగాలంటే గ్రామాల్లో బెల్ట్ షాపుల ద్వారా నిర్వహిస్తున్న మద్యం అమ్మకాలపై ఎక్సైజ్‌శాఖ నియంత్రించాల్సిన అవవసరం ఎంతైనా ఉంది. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో బెల్టు షాపుల ద్వారా మద్యం అమ్మకాలు కొనసాగిస్తున్న దుకాణ యజమానులకు గ్రామపంచాయతీ ఎన్నికలు అయ్యే వరకు అమ్మకాలు జరపకూడదని కౌన్సిలింగ్ నిర్వహించాలి. గతంలో ఎన్నికల కోడ్ అమలులోకి రాగానే గ్రామాల్లోని బెల్టు షాపులకు మద్యం సరఫరా చేసే వారు కాదు. డిసెంబర్ మొదటి తేదీ నుండి మద్యం షాపులు కొత్త టెండర్ దారులు చేతుల్లోకి వెళ్లనున్నడంతో పాత షాపుల వారు వారి దగ్గర ఉన్న నిల్వలను బెల్ట్‌షాపులకు అధికంగా ఇస్తున్నారు. త్వరలో గ్రామపంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ సమీపిస్తున్న నేపథ్యంలో మద్యం మత్తులో ఘర్షణ వాతావరణంతో పాటు ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ ఎక్సైజ్ శాఖ నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల్లో హోటల్స్, పాన్‌షాప్, కిరాణా షాపుల్లో బెల్టు షాపులు ద్వారా జరుగుతున్న మద్యం అమ్మకాలు ఆపాలి. త్వరలో ఎన్నికల కోడ్ అమలులోకి రానుండడంతో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి.

# ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయింపు ఇవ్వాలి



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** దేశ వ్యాప్తంగా ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలని టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఇస్లావత్ హాథీరామ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నో సంవత్సరాలుగా పాఠశాల విద్యాశాఖలో సర్వీస్ చేస్తున్న ఉపాధ్యాయులకు టెట్ నిబంధనల ద్వారా పరీక్ష రాసి పాస్ అయ్యి ఉద్యోగంలో కొనసాగాలి లేకపోతే ఉద్యోగం నుండి మినహాయించబడతారు అని చెప్పడం చాలా బాధాకరమైన అంశమని తెలిపారు. సోమవారం ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావలసినటువంటి బకాయిలు వెంటనే చెల్లించాలని, డిఏలు ఇచ్చి పిఆర్‌సిలు ప్రకటించాలని తెలినారు. కేజీబీవీ, ఔట్సోర్సింగ్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని, ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్‌లో పండిట్, పీఈటీల పోస్టులు అప్గ్రేడ్ చేసి ప్రమోషన్ ఇచ్చి వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈసందర్భంగా ఆ సంఘం మండల నూతన కమిటీని ఏర్పాటు చేశారు. అందులో అధ్యక్షులుగా గుగులోత్ రాంచందర్‌రావు, ప్రధానకార్యదర్శిగా అగ్గి రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా కల్తీ కృష్ణ, జీ వసంత, కోశాధికారిగా డి నాగేశ్వరరావు, కార్యదర్శులుగా వీరన్న బాబు, శైలజ, రమేష్, బి రవిలు ఎన్నికయ్యారు. ఈకార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు వి బాబులాల్ అతిథులుగా హాజరయ్యారు. ఈకార్యక్రమంలో విజయ, రేణుక, సురేష్, ప్రేమ్ కుమార్, శారదామని, హరినాథ్, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# తల్లాడ సర్పంచ్ అభ్యర్థిగా చల్లా నాగులు



**ప్రజాపక్షం/తల్లాడ :** తల్లాడ మేజర్ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా బిజెపి పార్టీ మండల అధ్యక్షులు చల్లా నాగులు బరిలో నిలవనున్నారు. బిజెపి జనసేన పార్టీ అభ్యర్థిగా చల్లా నాగులు పోటీకి సిద్ధమయ్యారు. అనతికాలంలోనే కార్యకర్త స్థాయి నుంచి మండల పార్టీ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. మద్యం నగదు పంపిణీ చేస్తేనే గెలుస్తాం అనే భావనలో ఉన్న ప్రస్తుత రోజుల్లో జనాలకు సేవ చేసే భావంతో గట్టి పత్యర్థులపై ఎంపిటిసిగా పోటీ చేసి గెలుపొందారు. యువత రాజకీయాల్లోకి రావడం వల్ల సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయని భావాలతో రాజకీయాల్లోకి ప్రవేశించి సేవ అనే భావంతో అనేక సమస్యలు పరిష్కరిస్తూ ముందుకు వెళ్తున్నారు. తమ వద్దకు వచ్చిన సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం చూపే విధంగా ప్రయత్నం చేస్తారని పేరు పొందారు. ప్రస్తుత రాజకీయ గడ్డు పరిస్థితిల్లో కూడా తనకంటూ గుర్తింపు పొంది తన పేరును పదిలంగా ఉంచుకున్నారు. తల్లాడ పంచాయతీ దశాబ్ధాలుగా ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని పలువురు సర్పంచ్‌లు పేరుకు మాత్రమే పనిచేశారని, కాని పంచాయతీని ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలని కార్యచరణ రూపొందించలేకపోయారు. ఇటువంటి తరుణంలో యువ నాయకుడు చల్లా నాగులు సర్పంచ్‌గా పోటీ చేయటం పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సమస్యలు తెలిసిన నాయకుడు సర్పంచ్‌గా గెలిస్తే పంచాయతీ పరిధిలోని కొన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఉపాధ్యాయునికి సన్మానం



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఉద్దీపకం పుస్తకంలోని పాఠ్యాంశాలను విద్యార్థులకు చక్క గా బోధిస్తున్న దుమ్ముగూడెం మండలం గంగోలు జిపిఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు కారం గాంధీని ఐటిడిఏ పిఓ రాహుల్ ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ చిన్నారుల విద్యాభ్యాసం పునాది నుండే బాగుండాలని విద్యార్థులకు చక్కగా బోధించి ప్రతీ అంశాన్ని అర్థమయ్యేరీతిలో వివరించి ప్రశ్నలు అడిగితే భయపడకుండా చెప్పేంత ధైర్యాన్ని విద్యార్థుల్లో నింపడం అభినందనీయం అన్నారు. గాంధీని ఆదర్శంగా తీసుకుని మిగతా ఉపాధ్యాయులు కూడా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిడి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# స్వీకరించిన దరఖాస్తులను పరిశీలిస్తాం

**- ఏపిఓ జనరల్ డేవిడ్ రాజ్**



**ప్రజాపక్షం/భద్రాచలం :** మూరుమూల గిరిజన గ్రామాల నుండి వచ్చి సమర్పించిన ప్రతీ దరఖాస్తును పరిశీలించి ఎన్నికల కోడ్ ముగియగానే పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజ్ అన్నారు. ఐటిడిఏ సమావేశపు మందిరంలో సోమవారం నర్విహించిన ప్రజావాణికి ఆయన హాజరై గిరిజనుల నుండి విన్నపాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపిఓ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతీ గిరిజన కుటుంబానికి దశవారీగా అందించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల మోడల్ కోడ్ ఉన్నందున, ఆ కోడ్ ముగిసిన అనంతరం ప్రతీ దరఖాస్తును శాఖల వారీగా పరిశీలించి పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటా మన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ పరిపాలనాధికారి సున్నం రాంబాబు, కొండరెడ్ల విభాగం అధికారి గన్యా, మేనేజర్ ఆదినారాయమ, ఎల్‌టిఆర్ డిటి రాము, నరేష్‌తో పాటు ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.